# పుస్తక సమీక్ష

## గుడిని గుండెతో చూద్దాం!



**సనాతన** ధర్మంలో ఆలయ వ్యవస్థ అత్యంత ప్రధానమైనది. మరే ఇతర మతంలో లేని ప్రత్యేకత మన ఆలయాల పద్ధతిలో ఉంది. అదేమిటో తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువు మీదా ఉంది. దేవాలయాల నిర్మాణంలో ప్రత్యంశం ఏ పద్ధతిలో రూపు దిద్దుకుంటుందో తెలియడంతో పాటు అక్కడ భక్తులు ఏ విధంగా మెలగాలో, దేవతానుగ్రహం కోసం ఏ నియమాలు పాటించాలో తెలియజేసే గొప్ప గ్రంథాన్ని రచించారు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ. నేటి సమాజంలో ఆధ్యాత్మికత కూడా ప్రబలంగానే గోచరిస్తున్నది. కానీ ఆధ్యాత్మికతకు అందవలసిన ఫలాన్ని ఆ మార్గాన పయనించేవారు పొందుతున్నారా అంటే అవుననలేని స్థితి కనిపిస్తున్నది. దానికి కారణం ఆధ్యాత్మిక అంశాల పట్ల సరైన అవగాహన లేకపోవడమే. అందువల్ల తీర్థయాత్రలు ఆ యాత్రికుల సంస్కార బలాన్ని పెంపొందించలేకపోతున్నాయి. దేవాలయ సందర్శకులు తాము కొలుచుకుంటున్న దైవాన్ని సాక్షాత్కరింప చేసుకోవటమే వారి యాత్ర లేదా సందర్శనకు ముఖ్యమైన ఫలం. ఆ ఫలాన్ని వారు అందుకోవడానికి 'దేవుణ్ణి చూద్దాం... రండి' మార్గదర్శనం చేస్తుంది అనడంలో సందేహం లేదు. స్వామి వివేకానందులు రామకృష్ణ పరమహంసను– 'మీరు దేవుడిని చూశారా? నాకు చూపిస్తారా?' అని ప్రశ్నించినప్పుడు– 'నిన్ను చూస్తున్నంత స్పష్టంగా చూశాను. అలాగే నీకు కూడా చూపిస్తాను' అని సమాధానమిచ్చి, అదేవిధంగా చేసిన విషయం జగద్విదితం. అలా దృఢమైన రీతిలో 'దేవుణ్ణి చూద్దాం... రండి' అనే పేరుతో ఈ రచన వెలువడటం ముదావహం. ఈ పుస్తకం చదివిన తర్వాత.. గుడికి వెళ్లినా, యాత్రకేగినా.. అంతకుముందు పొందిన అనుభూతి కన్నా పదింతల అలౌకిక ఆనందాన్ని పొందుతారని చెప్పొచ్చు.

### దేవుణ్ణి చూద్దాం... రండి

**రచన:** డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
**పేజీలు:** 128, వెల: రూ.81
**ప్రతులు:** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో లభ్యం


## బుక్ షెల్ఫ్

### చదువులమ్మ ఒడిలో.. జ్ఞాప'కాలం'!



**ప్రచురణ:** ఎస్.ఆర్ అండ్ బి.జి.ఎన్.ఆర్ పూర్వ విద్యార్థుల సంఘం– ఖమ్మం
**పేజీలు:** 120,
**వెల:** రూ.100
**ప్రతులు:** 94418 64514, 72078 64514

### కిశోర గాంధీయం (వచన కవిత్వం)



**రచన:** గజ్జారాం చట్ల
**పేజీలు:** 104,
**వెల:** రూ.150
**ప్రతులు:** పాలపిట్ట బుక్స్– 98487 87284
**రచయిత:** 99592 99039

### ఏడుకోలల బావి (ఎన్నికల శతకం)



**రచన:** ఏనుగు నరసింహారెడ్డి
**పేజీలు:** 155,
**వెల:** రూ.150
**ప్రతులు:** పాలపిట్ట బుక్స్– 98487 87284

## ఘనం.. పీవీ వనం

### అల్లనేరేడు చెట్టు



మహా సుందరాంగుల కళ్లకు సరిపోయే అందం నేరేడుది. ఎందరో కవులు సృజించిన కవిత్వంలో కథానాయిక అందానికి ఆసరా అయింది. నునుపుదేలి నిగనిగలాడే ఈ నేరుడు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. అల్ల నేరేడు చెట్టు రావి, మర్రి చెట్లంత పెద్దది కాదు. కానీ మరీ చిన్నదీ కాదు. దాదాపు 30 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. ఇది వందేళ్ల దాకా బతుకుతుంది.

దీని ఆకులు దళసరిగా, పొడవుగా ఉంటాయి. అల్లనేరేడు చెట్లు వర్షాకాలం.. అంటే జూలై నుండి అక్టోబరు మాసాల్లో విరివిగా పండ్లను కాస్తాయి. సాగదీసిన గుండ్రని ఆకారంలో ఉంటాయివి. ముదురు వంకాయ రంగులో చూడగానే తినాలనిపించేలా ఉండే ఈ నేరేడు పండ్లలో అనేక ఔషధగుణాలున్నాయి. ఈ పండ్లు తింటే కిడ్నీలోని రాళ్లు కరిగిపోతాయి. నేరేడు పండులో ఉండే సహజసిద్ధమైన ఆమ్లాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదపడతాయి. నేరేడు విత్తనాలను ఎండబెట్టిన తర్వాత పొడిచేసి మధుమేహ నివారణ ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. నేరేడు చెక్కని నీళ్లలో ఉడికించి కషాయం తీస్తారు. ఆ నీటితో పుక్కిలిస్తే, నోటి అల్సర్లు (పుండ్లు) తగ్గిపోతాయి. నేరేడు చెట్లు మన దేశంలో చాలా సులభంగా పెరుగుతాయి. ఈ చెట్టు ఆకులు కాల్చి, పొడిచేసి పళ్లు తోముకుంటే తెల్లగా మిలమిల మెరుస్తాయి. నేరేడు చిగురాకులు తేనెతో కలిపి తీసుకుంటే పైత్యపు వాంతులు ఆగిపోతాయి. ఈ ఫలాలు తినడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. నేరుడులో అధిక మోతాదులో సోడియం, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, మాంగనీస్, జింక్, ఐరన్, విటమిన్–సి, విటమిన్–ఎ, విటమిన్–బి2 (రిబోఫ్లేవిన్), ఫోలిక్ ఆమ్లం ఉంటాయి. నేరేడు రోజూ తింటే రక్తహీనత తగ్గుతుంది. రైతులు నేరేడు కలపతో వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తారు. రోడ్డు పక్కన, అడవుల్లో పెరిగే ఈ చెట్లను ఇప్పుడు రైతులు వాణిజ్య పంటగా పెంచుతుండటం గమనార్హం. ఈ పండ్లలో విత్తనం పెద్దగా, గుజ్జు తక్కువగా ఉంటుంది. అయినా ఈ గుజ్జుని సేకరించి, నిలువచేసి అన్ని కాలాల్లో వినియోగించేలా కొన్ని వాణిజ్య సంస్థలు అందుబాటులోకి తెస్తున్నాయి. మన దేశంలో కొంత భూభాగం పోర్చుగీసు వారి పాలనలో ఉన్నప్పుడు బ్రెజిల్ కూడా వాళ్ల ఏలుబడిలోనే ఉండేది. నేరేడు రుచి పోర్చుగీసువారికి బాగా నచ్చి, దాని విత్తనాలను బ్రెజిల్‌కి తీసుకుపోయారు. ఇప్పుడా దేశమంతటా నేరేడు విస్తరించింది.

**- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు**

## అది ఎవరు?

(...13వ పేజీ తరువాయి)

### సమాధానం

రమణమ్మ ఈ రెండు హత్యలు చేసింది. విషాన్ని మోక్ష తాగే గ్లాసుకు పూసింది. అందులో సునయన చేసిన పాయసం పోసింది. ఇక, పాయసం వద్దన్న మిత్ర కోసం సునయన యాపిల్ తెమ్మంది. తొలుత చాకుకు రెండు వైపులా విషాన్ని పూయాలనుకొన్న రమణమ్మ.. రెండో యాపిల్ ముక్క ఒకవేళ సునయన తింటే ఆమె చచ్చి.. ఈ మొత్తం కేసు తనమీదకు వస్తుందని భయపడింది. అందుకే మిత్రకు ఇచ్చే ముక్క వైపునే చాకుకు విషం పూసింది. అలా మిత్రను చంపేసింది. సునయనే పాయసం చేయడం, యాపిల్ తీసుకురమ్మనడంతో పోలీసు కేసు ఆమె మీదకు వస్తుందని రమణమ్మ భావించింది. ఇక, సునయన ఈ కేసులో జైలుకు వెళ్లాక చిన్న పిల్లాడిని బిల్డింగ్ మీద నుంచి తోసి చంపాలనుకొన్నది రమణమ్మ. కాగా రుద్ర మెదడు పాదరసంలా పనిచేయడంతో రమణమ్మ ఇలా దొరికిపోయింది. కాగా ఆస్తి కోసం మంచివాడిలా నటించిన సురేశ్ పురమాయించడంతోనే.. వచ్చే ఏడాది మేజర్ కాబోతున్న మిత్రను, అలాగే మోక్షను రమణమ్మ ఇలా చంపేసినట్టు వాళ్లు మాట్లాడుకొన్న కాల్ సంభాషణల ద్వారా తెలిసింది.